క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి 3 దశాబ్దాల పాటు సర్పంచ్‌గా కొనసాగిన గోగినేని న్యాషా భక్తరాజు 39వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 4వ తేదీ ఉప్పుగుండూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద కిమ్స్ వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జయంత్‌బాబు, తూబాటి శ్రీకాంత్ తెలిపారు. అనంతరం భక్తయ్య విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన, సాయంత్రం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాం

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ నిధుల్లో పెండింగ్ బిల్లులు చెల్లించామని తాళ్లూరు మండలం విఠలాపురం పంచాయతీ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ అతిథిగృహంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ 2018–19కి సంబంధించి ఉపాధిహామీ నిధులు చెల్లింపులు సక్రమంగా జరిగాయని తెలిపారు. 2021 ఏప్రిల్‌లో సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం సెప్టెంబర్‌లో ఉపాధి హామీ నిధుల నిబంధనల ప్రకారం పంచాయతీ ఖాతాకు జమ అయ్యాయని తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు పెండింగ్ బిల్లులు పరిశీలించి ప్రత్యేక అధికారి ధృవీకరణ అనంతరం గతంలో చెల్లించిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లు చెల్లించినట్లు తెలిపారు. దీనిలో సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి, అధ్యక్షుడు శ్రీరామమూర్తి ఉన్నారు.

140 మందికి వైద్య సేవలు

ఒంగోలు అర్బన్: స్థానిక గుంటూరు రోడ్డులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రతి నెల మొదటి గురువారం ప్రముఖ మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ చాపల వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. గురువారం జరిగిన వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, గర్భిణీ, జనరల్ మెడిసిన్, ఊపిరితిత్తులు, గుండె, దంత సమస్యలకు సంబంధించి 140 మందికి ఉచిత వైద్య సేవలందించారు. డాక్టర్‌లు గైనాకాలజిస్ట్ చాపల శాంతకుమారి, జనరల్ ఫిజీషియన్ సానల ధీరజ్‌బాబు, ల్యాపరోస్కోపిక్ సర్జన్‌సున్నపు విజయ్‌కుమార్, ఊపిరితిత్తులవైద్య నిపుణులు కుమార్‌వర్మలు పాల్గొని వైద్య సేవలందించారు.

ఏడాదిలోనే ఎనలేని అభివృద్ధి

ఒంగోలు టౌన్: పీడీపీఎఫ్ సంస్థను ప్రారంభించిన తొలి ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలను సాధించామని సంస్థ చైర్మన్ పోతినేని వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సంస్థ కార్యాలయంలో జరిగిన వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలోనే 15 కోట్ల రుపాయలకు పైగా అభివృద్ధి సాధించినట్లు చెప్పారు. రికరింగ్ డిపాజిట్లపై 9 శాతం వడ్డీ, మోర్టిగేజ్ రుణాలు, సంస్థ అభివృద్ధి గురించి వివరించారు. పీడీపీఎఫ్ సంస్థ మున్ముందు నగరంలో అగ్రగామి సంస్థగా నిలుస్తుందని ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్లూరి వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ ప్రధాన డైరెక్టర్ పోకూరి వెంకటేశ్వర్లు, మన్నం హనుమంతరావు, వెంకటస్వామి, శివ నాగేశ్వరరావు, ఎంసీఏడీ ప్రెసిడెంట్ పాటిబండ్ల వెంటేశ్వర్లు, పీడీపీఎఫ్ వలప్ కమిటీ సభ్యులు బాలాజీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ పార్కులపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: రాష్ట్రంలో సోలార్ విద్యుత్ పార్కుల ఏర్పాటుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించగా దానికి కేంద్ర విద్యుత్, నూతన పునరుత్పాదక శక్తి శాఖామంత్రి ఆర్‌కె సింగ్ సమాధానం ఇచ్చారు. డెవలప్‌మెంట్ ఆఫ్ సోలార్ పార్కు కింద 4100 మెగావాట్ల సామర్థ్యం గల 5 సోలార్ పార్కులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంజూరు చేశామన్నారు. 1400 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పార్కు అనంతపురం–1, వెయ్యి మెగావాట్ల సామర్థ్యం ఉన్న పార్కు కర్నూలు, కడప, 500 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పార్కు అనంతపురం–2పార్కు, 200 మెగావాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ విండ్ హైబ్రీడ్ పార్కు మరొకటి రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ఆమోదించామన్నారు. వాటిలో అనంతపూర్ –1, కర్నూలు సోలార్ ప్లాంట్లు మొత్తం 2400 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నామని, కడప పార్కు 250 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నామని, అనంతపురం– 2 పార్కు 400 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం 2024 మార్చి వరకు పొడిగించినట్లు కేంద్రమంత్రి వివరించారు.

దివ్యాంగుల ఉపాధికి చెక్కుల పంపిణీ

ఒంగోలు అర్బన్: జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అర్హులైన పలువురు దివ్యాంగులకు జీవనోపాధి కల్పించుకునేందుకు అవసరమైన మొత్తాన్ని చెక్కుల రూపంలో అందచేశారు. గురువారం స్పందన భవనంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ చెక్కులు పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 22 మంది లబ్ధిదారులకు ఉపాధి కోసం రూ.60.50 లక్షల చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యాన్ని గడపగడపకు విస్తరించాలి

- గృహ సారధులకు శిక్షణ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను ప్రజలకు అందజేస్తున్నారని, ఆ సంక్షేమ రాజ్యాన్ని గడపగడపకు విస్తరించేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు సైనికుల్లా పనిచేయాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. మండలంలోని ఉప్పుగుండూరు కాపు కళ్యాణ మండపం, మద్దిరాలపాడులోని పార్టీ మండల కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్‌బాబు మాట్లాడుతూ 151 ఎమ్మెల్యే సీట్లతో అధికారంలోకి వచ్చి ఎన్నికల హామీలను 90 శాతానికిపైగా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దీనిని చూసి ఓర్వలేని ఎల్లోమీడియా, దత్తపుత్రుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగడం లేదని అసత్య ప్రచారాలకు పూనుకుంటున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సంతనూతలపాడు నియోజకవర్గంలోని 60 సచివాలయాల్లో 56 వేల గడపలకు తాను స్వయంగా తిరిగానిని, ప్రతి కుటుంబంలో లక్ష రూపాయల నుంచి 5 లక్షల రూపాయల వరకు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరిందని తెలిపారు. దీంతో పాటు గ్రామగ్రామాన అబివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కొత్తగా సచివాలయ పరిధిలో కన్వీనర్లు, గృహ సారధుల వ్యవస్థను తీసుకొచ్చిన ప్రభుత్వం.. మరింత మేలు చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. అందరూ బాధ్యతగా పనిచేసి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని గృహ సారధులకు దిశానిర్దేశం చేశారు. తద్వారా రాబోయే 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగి ప్రజల మనస్సుల్లో సుస్థిరంగా నిలిచిపోతారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదల రత్నభారతి, మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కుమ్మూరి సుధాకర్, పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, కొలకలూరి విజయ్‌కుమార్, పేరాల చెన్నకేశవులు, కూనం పూర్ణచంద్రరావు, పోలినేని కోటేశ్వరరావు, కరణం రమేష్, ఉప్పుగుండూరు వాసు, మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యం



రవాణాశాఖ ఉప కమిషనర్ శ్రీకృష్ణవేణితో ప్రమాద రహిత డ్రైవర్లు

- ఆర్టీసీలో ముగిసిన రోడ్డు భద్రతా వారోత్సవాలు
- ప్రమాద రహిత డ్రైవర్లకు ఘనంగా సన్మానం
- మహిళలు డ్రైవింగ్‌లో శిక్షణ పొందాలన్న డీటీసీ బి.శ్రీకృష్ణవేణి

ఒంగోలు: ఆర్టీసీలో రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో గురువారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణాశాఖ ఉప కమిషనర్ బి.శ్రీకృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ అయిన సందర్భంగా ఆర్టీసీలో కూడా మహిళలకు ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. మహిళలు లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ మాత్రమే కాకుండా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకోవడం ద్వారా బస్సు డ్రైవర్లుగా ఉద్యోగావకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా కూడా ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో మహిళలు శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. ప్రమాద రహితంగా 32 ఏళ్లకు పైగా ఆర్టీసీలో పని చేస్తూ రీజనల్ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన కనిగిరి డిపో డ్రైవర్ కె.నారాయణను ప్రత్యేకంగా సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ అధికారి బి.సుధాకరరావు మాట్లాడుతూ ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని, అందుకు అవలంభిస్తున్న చర్యలను వివరించారు. అనంతరం రీజనల్ స్థాయిలో ముగ్గురిని, డిపో స్థాయిలో ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారిని సత్కరించి నగదు బహుమతులు అందించారు. ఎంవీఐ కిరణ్ ప్రభాకర్, ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్‌శ్రీనివాస్, ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఇతర డిపోల మేనేజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్లు:

రీజనల్ స్థాయి:కె.నారాయణ(కనిగిరి), పీఎం ఖాన్(గిద్దలూరు), జీసీహెచ్ సింగయ్య(ఒంగోలు)

ఒంగోలు డిపో: ఎస్‌కేహెచ్‌ఎం బాషా, జి.సుబ్బారావు, కె.రఘురాం

మార్కాపురం డిపో: సీహెచ్ వీ.రెడ్డి, ఎస్‌కె ఎం వలి, జీఆర్ రాజు

పొదిలి డిపో: ఎ.ఆంజనేయులు, పి.మస్తాన్, జీపీ రావు

కనిగిరి డిపో: కేఎస్ స్వామి, కేఎస్ రెడ్డి, ఎస్‌కేఎస్ రసూల్

గిద్దలూరు డిపో: ఎస్‌ఏ సమ్మద్, ఎస్‌కే ఎం సాహెబ్, ఎస్‌కేకే వలి

ఈతముక్కల పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు



కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ధృవీకరణపత్రం చూపిస్తున్న రవీంద్రారెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): ఈతముక్కల పీహెచ్‌సీలో మెరుగైన సేవలందించడంతో పాటు అవార్డులు అందుకుంటున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అన్నారు. స్థానిక హాస్పిటల్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ సమావేశానికి రవీంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా ఈతముక్కల హాస్పిటల్ పనిచేస్తుందన్నారు. హాస్పిటల్‌లో నిత్యం ప్రసవాలు చేయడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. హాస్పిటల్‌లో మెరుగైన సేవలు అందించడానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. వారంలో ఒక రోజు ఎముకలు, కీళ్లు, నరాలకు సంబంధించిన డాక్టర్, దంత వైద్యులు వస్తుంటారని పేర్కొన్నారు. రోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించి తీర్మానించారు. మెరుగైన సేవలందించినందుకు కేంద్రం అవార్డులు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. కేంద్రప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి సంబంధించి అందించే ఎన్‌కాస్ అవార్డు పీహెచ్‌కి రావడంతో వెంకటేష్, శివపార్వతి అభినందించారు. ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత, డాక్టర్ డి.వెంకటేష్, డాక్టర్ శివపార్వతి, సర్పంచ్ మేడికొండ సునీత, బండారు వెంకటసుబ్బారావు, మురళీ, సచివాలయం కన్వీనర్ సంజీవరెడ్డి, తుమ్మ పుల్లయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీని నీరుగార్చే బడ్జెట్



నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, ఉపాధి హామీ పథకాలు నీరుగార్చే విధంగా ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సంతనూతలపాడులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆ సంఘ జిల్లా నాయకుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణాలలో కూడా ఉపాధి హామీ అమలు చేయాలని కోరుతున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు తగ్గించడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. దాని వలన ఉపాధి కూలీల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని, వ్యవసాయ రంగం నిర్వీర్యం అవుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇంటి పన్నులు వేగవంతం చేయాలి

- డీఎల్‌పీఓ పద్మ



ఇంటి పన్నుల వసూళ్లపై మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

కొత్తపట్నం: ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేసి నెలాఖరుకు పూర్తి చేయాలని డీఎల్‌పీఓ ఆర్ పద్మ ఈఓఆర్డీలను ఆదేశించారు. మండలంలోని అల్లూరు గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రూ.23 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.7.34 కోట్లు మాత్రమే వసూలు చేశామన్నారు. మిగిలిన రూ.15.85 కోట్లు నెలాఖరులోగా వసూలు చేయాలని ఆదేశించారు. 12 మండలాల్లో తనిఖీలు నిర్వహించి పన్నులు వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రొయ్యల హేచరీలలో కూడా పన్నులు వసూలు చేయాలన్నారు. మండలంలో అల్లూరు, కొత్తపట్నం , మడనూరు పంచాయతీల్లో 15 శాతం కూడా పన్నులు వసూలు చేయలేదని మండిపడ్డారు. వెంటనే పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈఓఆర్డి ఏ.బాలచెన్నయ్య, అల్లూరు పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాలినేని మేలు మరువలేం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న యాదవులు

- వైఎస్సార్ సీపీ యాదవ సామాజికవర్గ ప్రతినిధులు

ఒంగోలు: యాదవులకు బాలినేని చేసిన మేలు మరువలేనిదని వైఎస్సార్ సీపీ యాదవ సామాజిక వర్గ ప్రతినిధులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోడుబోయిన సురేష్‌యాదవ్ నేతృత్వంలో గురువారం జరిగిన ఆత్మీయ సమావేశానికి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పటాపంజుల శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి కటారి ప్రసాద్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేవీ ప్రసాద్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు యనమల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు యనమల నాగరాజు, జెడా వెంకటేష్, అంగిరేకుల గురవయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు జమ్ము శ్రీకాంత్, నాయకులు కేకే రాజు, జమ్ము రత్తయ్య, ఎందేటి రంగారావు, కండే రమణయ్య యాదవ్, గండు మధు, చావలి శివప్రసాద్, విస్సుయాదవ్, రావులపల్లి ధనలక్ష్మియాదవ్, మాజీ జెడ్పీటీసీ మట్టి రాఘవ, బొమ్మినేని మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 మందిని కార్పొరేటర్లుగా, ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవితో పాటు ఎన్నో నామినేటెడ్ పదవులు కూడా కేటాయించారన్నారు. 2019 ఎన్నికలకు ముందు యాదవ సామాజిక వర్గం బొల్లావులతో నిర్వహించిన కార్యక్రమం బాలినేని విజయానికి నాందిగా మారిందని, అదే తరహాలో ఈ దఫా కూడా ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో యాదవులకు సంబంధించి కొన్ని అంశాలను కూడా బాలినేని దృష్టికి తీసుకువెళ్లి వాటిని సాధించుకోవడంతోపాటు నగరంలోని యాదవులకు ఏవైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించుకునేందుకు వీలుగా యాదవ నగర కమిటీని కూడా ఏర్పాటుచేసుకోవాలని నిర్ణయించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవిని మరో మారు యాదవులకు కేటాయించాలని విజ్ఞప్తి చేయాలని తీర్మానించారు. వివిధ సామాజికవర్గాలకు వివిధ రకాలైన భవనాలు ఉన్నాయని, కానీ యాదవులకు యాదవ భవన్ కూడా అవసరమని, దాని ప్రతిపాదనను బాలినేని దృష్టిలో పెట్టి సాధించుకోవాలని తీర్మానించారు. సామాజికవర్గాల వారీగా పార్టీలు ఉన్నా యాదవ సామాజిక వర్గం మాత్రం బ్యాక్‌బోన్‌గా అభివర్ణించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే వెంటే ఉంటారన్నారు. 2024లో మరోమారు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టి మరిన్ని మెరుగైన పదవులు, నామినేటెడ్ పోస్టులు దక్కించుకునేందుకు నగరంలో ఒక కమిటీని కూడా వేసుకోవాలని తీర్మానించారు.

ఉపాధ్యాయుల ధర్నాకు హాజరుకావాలి

నాగులుప్పలపాడు: ఒంగోలులోని డీఈవో కార్యాలయం ఎదుట ఈ నెల 4వ తేదీ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జేవీఆర్ కోరారు. అన్ని కేడర్లలో అవకతవకలు లేని సీనియార్టీ లిస్టు ఇవ్వాలని, పని సర్దుబాటు ప్రక్రియలో ఉన్న ఇబ్బందులు తొలగించాలని, నిబంధనలకు విరుద్ధంగా డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న వారిని తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ సహకారంతో అందరూ ఎదగాలి



గార్మెంట్ షాపును ప్రారంభిస్తున్న అశోక్‌బాబు, యుగంధర్‌రెడ్డి

నాగులుప్పలపాడు: ప్రభుత్వం ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ప్రతిఒక్కరూ ఎదగడానికి కృషి చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. పీఎంఈజీపీ సహకారంతో నాగులుప్పలపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన స్మైలీ రెడిమేడ్స్, గార్మెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ప్రభుత్వాలు అనేక రకాల రుణాలు, సబ్సిడీలు అందిస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని అంతకంతకూ ఎదగాలని సూచించారు. ప్రారంభోత్సవంలో కెనరా బ్యాంక్ ఎల్డీయం యుగంధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ డీపీఎం సుబ్బారావు, పీపీఎం డేవిడ్, నాగులుప్పలపాడు ఏపీఎం రవికుమార్, విజయ్ పాల్గొన్నారు.

శరవేగంగా ప్రకాశం ప్రగతి



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ సుజాత



బ్రాహ్మణ సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ప్రకాశం పంతులుకు నివాళి

– మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా శరవేగంగా ప్రగతి పథంలో పయనిస్తుందని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. ప్రకాశం జిల్లా 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక లాయరుపేటలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు లాంటి ఎందరో మహనీయుల త్యాగాల ఫలితాల వల్ల నేడు ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారని చెప్పారు. ప్రకాశం కలలను నిజం చేసేందుకు ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కోవిడ్ సంక్షోభంలో కూడా ప్రజలను ఆదుకున్న ఘనత సీఎం జగనన్నకు మాత్రమే దక్కిందని కొనియాడారు. ఒంగోలు సమగ్రాభివృద్ధి కోసం బాలినేని కృషి చేస్తున్నారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ కుల మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ మూర్తి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి శాండిల్యా, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో...

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య నగర, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లాయరుపేటలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెల్లదొరలకు ఎదురొడ్డి గుండెను చూపించిన ధీశాలిగా ప్రకాశం పంతులు ఎందరికో స్ఫూర్తినిచ్చారని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించారని వక్తలు కొనియాడారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దామరాజు క్రాంతికుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర నాయకులు కస్తూరి రంగా,శ్రీనివాసాచార్యులు, డా.కృష్ణారావు, రామ్ ప్రసాద్, కునుమళ్ల శేషగిరిరావు, నగర అర్చక సంఘం అధ్యక్షుడు ఎమ్వీ రాముశర్మ, సీహెచ్ అప్పారావు, వీవీ సాయి కృష్ణ పాల్గొన్నారు.

నేడు 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

ఒంగోలు: నగరంలోని 31వ డివిజన్‌లోని విజయ్‌నగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ లైను వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కోతల బడ్జెట్‌తో ప్రజలకు వెతలు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ గ్రామీణ ప్రాంతాలను, వ్యవసాయ రంగాన్ని, గ్రామీణ నిరుపేదలను పూర్తిగా విస్మరించిందని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు మండిపడ్డారు. స్థానిక ఎల్బీజీ భవన్ సెంటర్లో గురువారం బడ్జెట్ పత్రాలను చించివేసి నిరసన వ్యక్త చేశారు. 65 శాతానికి పైగా ప్రజలు జీవిస్తున్న గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ రంగాన్ని మరింతగా సంక్షోభంలోకి నెట్టేలా కేంద్ర బడ్జెట్ ఉందని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు సమిడి వెంకటరావు, కంకణాల ఆంజనేయులు విమర్శించారు. వ్యవసాయ రంగానికి, ఎరువులపై సబ్సిడీని గతేడాది కంటే తక్కువగా కేటాయించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఆహార సబ్సిడీకి రూ.90 వేల కోట్లు కోత పెట్టారని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా రూ.30 వేల కోట్ల కోత పెట్టారని మండిపడ్డారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల బతుకుల్ని మరింత సంక్షోభంలోకి నెట్టారని ఆవేదన వ్యక్త చేశారు. కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్‌గా అభివర్ణించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘాల నాయకులు పెంట్యాల మనుమంతరావు, యస్‌కే మహబూబ్, ఎస్. నరసింహారావు, కిరణ్, రవికుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఎస్ ప్రకాశరావు

ఒంగోలు: స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు గురువారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా సత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర కల్చరల్ కో ఆర్డినేటర్ ఎంఎస్ ప్రకాశరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ష్యూర్–సక్సెస్ అనే అంశంపై అవగాహన కల్పించారు. జీవితంలో లక్ష్యాన్ని ఎలా నిర్ణయించుకోవాలి, విజయం వైపు అడుగులు ఎలా వేయాలనే పలు అంశాలపై విద్యార్థులకు జీవితంలో విజయాలను కైవసం చేసుకున్న వారి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాలల చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ మాట్లాడుతూ విద్యార్థులకు నేటి సమాజంలో ఉన్న పోటీని ఎదుర్కొవాలంటే ఇటువంటి శిక్షణ తరగతులు అవసరమన్నారు. అధ్యాపకులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్వీ రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు ముదివర్తి బాబూరావు మృతి



బాబూరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

ఒంగోలు: బీజేపీ సీనియర్ నాయకుడు, ఎస్సీ మోర్చా సభ్యుడు ముదివర్తి బాబూరావు అనారోగ్యంతో గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ శివారెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పులి వెంకట కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సెగ్గెం శ్రీనివాసరావుతో పాటు పలువురు బీజేపీ నాయకులు గురువారం మధ్యాహ్నం బాబూరావు నివాసానికి చేరుకున్నారు. బాబూరావు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందంటూ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చి వ్యక్తిగతంగా కొంత ఆర్థిక సాయాన్ని అందించారు.